
సందేశం టైమ్స్ - జాతీయ తెలుగు దినపత్రిక
ఉద్యోగ అవకాశాలు
మా దినపత్రికలో పనిచేయుటకు
కింది స్థాయిలలో రిపోర్టర్లు కావలెను :
జిల్లాల వారీగా | నియోజకవర్గాల వారీగా | మండలాల వారీగా
సీఈఓ శెట్టి వెంకటేష్ గౌడ్. తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.
ఆసక్తిగల అభ్యర్థులు సంప్రదించండి: ఫోన్: 9052045435, ఈమెయిల్: Sandeshamtimes@gmail.com

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




బుధవారం 18 ఫిబ్రవరి 2026 | పేజీలు : 04 | వెల : రూ 2/- | సంపుటి : 1 సంచిక 262 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత




## బయోఏషియా వేదికగా తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా సీఎం రేవంత్ పిలుపు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి): హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా సదస్సులో ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు, బయోఏషియాకు ప్రపంచ ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ 23 సంవత్సరాల క్రితం బయోఏషియా ప్రారంభమైనప్పుడు హైదరాబాద్‌కు చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ, సాఫ్ట్‌వేర్ నగరం అన్న గుర్తింపు ఉండేదని, ఈ రోజు ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా ఎదిగిందని పేర్కొన్నారు. దూరదృష్టి నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్య మానవ వనరులు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ఆధారంగా హైదరాబాద్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు, పరిశోధన మరియు డిజైన్ రంగాలకు ప్రపంచ కేంద్రంగా అవతరించిందన్నారు. గత రెండు సంవత్సరాల్లో జీవవిజ్ఞాన రంగంలో ₹73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చినట్లు వెల్లడిస్తూ, దావోస్‌లో కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించామని, జీనోమ్ వ్యాలీ విస్తరణ, "వన్-బయో" ప్రారంభం, గ్రీన్ ఫార్మా సిటీ వేగవంతం వంటి చర్యలు తీసుకున్నామని తెలిపారు. బయోఏషియా 2026 ఈ దృఢ సంకల్పానికి ప్రత్యక్ష సాక్ష్యమని, ప్రపంచవ్యాప్తంగా 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు హాజరుకావడం గర్వకారణమని అన్నారు. "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ ప్రకారం 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా పెట్టుకున్నామని, పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్స్, చిన్న మధ్య తరహా సంస్థలు మరియు ప్రభుత్వం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. బల్క్ డ్రగ్స్ నుంచి బయాలజిక్స్ వరకు, తయారీ నుంచి ఆవిష్కరణ వరకు తెలంగాణ ప్రపంచ అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడే స్థాయికి ఎదిగిందని పేర్కొంటూ పెట్టుబడులు పెట్టాలని, GCCలను స్థాపించాలని, AI, క్లినికల్ అనలిటిక్స్, డిజిటల్ తయారీ రంగాల్లో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. ప్రభుత్వం, అధికారులు, శాస్త్రవేత్తలు, యువత పెట్టుబడిదారుల విజయానికి భాగస్వాములుగా ఉంటారని హామీ ఇస్తూ, హైదరాబాద్‌ను ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.




## "ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్"గా హైదరాబాద్ 2030 నాటికి 5 లక్షల ఉద్యోగాల లక్ష్యం


సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి): ఫార్మా రాజధానిగా పేరొందిన హైదరాబాద్‌ను "ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్"గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హెచ్ఐసీసీలో నిర్వహించిన "బయో ఏషియా 2026" ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించి, కొత్తగా 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో తెలంగాణను నిలిపేందుకు "తెలంగాణ నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ (2026-2030)" రూపొందించామని వెల్లడించారు. ఇప్పటి వరకు సరఫరా కేంద్రంగా ఉన్న హైదరాబాద్ ఇప్పుడు గ్లోబల్ సమస్యల పరిష్కారాల కేంద్రంగా మారుతోందని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా mRNA, జీన్ ఎడిటింగ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ వంటి ఆధునిక రంగాల్లో యువతను "రెడీ టు వర్క్ ఫోర్స్"గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సీబీఆర్ఈ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ (2025) ప్రకారం బోస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, బీజింగ్, టోక్యో సరసన నిలిచిన ఏకైక భారతీయ నగరం హైదరాబాద్ అని పేర్కొన్నారు. కేవలం ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా కొత్త ఔషధాల ఆవిష్కరణ కేంద్రంగా, అలాగే గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక పాలసీలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, ఆటోమేషన్ ఇన్ బయోలాజిక్స్ మాన్యుఫాక్చరింగ్, డేటా ఆధారిత ప్రెసిషన్ మెడిసిన్, కంప్యూటేషనల్ బయాలజీ, బయో మాన్యుఫాక్చరింగ్ 4.0 వంటి రంగాల్లో తెలంగాణతో భాగస్వామ్యం కావాలని దేశ విదేశాల పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు.

## పురపాలక పరిపాలనపై సీఎం రేవంత్ సమీక్ష – స్మార్ట్ పోల్స్, స్కైవాక్‌లు, కఠిన చర్యలకు ఆదేశాలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి): సచివాలయంలో పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు హాజరయ్యారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు అంశంపై సమగ్ర అధ్యయనం చేయాలని, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పీపీపీ విధానంలో స్కైవాక్ బ్రిడ్జిల ఏర్పాటు సాధ్యతపై పరిశీలించాలని సీఎం ఆదేశించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అడ్వర్టైజింగ్ బోర్డుల ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం బోర్డులను కేటాయించాలని, బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని, అనధికార బోర్డులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నగరంలో వీధిదీపాల నిర్వహణలో యూనిక్ కోడ్ విధానం అమలు చేసి పర్యవేక్షణ బలోపేతం చేయాలని, ప్రధాన జంక్షన్ల వద్ద స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ విభజనతో తలెత్తిన సమస్యల పరిష్కారానికి మార్గదర్శకాలు ఇచ్చిన సీఎం, మూడు కార్పొరేషన్లలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. త్వరలో ప్రతి జోన్‌లో పర్యటిస్తానని, రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, నగరంలోని అన్ని పార్కుల వివరాలు సేకరించాలని తెలిపారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒక రోజు శిక్షణ ఇవ్వాలని కూడా సూచించారు.

## నాగర్ కర్నూల్ జిల్లా మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ దర్శనం





సందేశం టైమ్స్, అచ్చంపేట, ఫిబ్రవరి 18: నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం మద్దిమడుగు గ్రామంలోని పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజ్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి ఘన స్వాగతం పలికారు. ముందుగా వినాయకుడిని దర్శించుకుని గజస్తంభం వద్ద నమస్కరించిన అనంతరం ప్రధాన గర్భగుడిలో ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రి దేవాలయ చరిత్ర, విశిష్టతను వివరించగా, అనంతరం ఆలయంలోని శివలింగాన్ని దర్శించుకుని వేద పండితుల నుండి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వాదాలు పొందారు.

## జేఈఈ మెయిన్స్-2026లో గిరిజన గురుకులాల విద్యార్థుల ప్రతిభ – రాష్ట్రానికి గర్వకారణం




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 18: జేఈఈ (మెయిన్)-2026 మొదటి విడత (సెషన్-1) ఫలితాలలో తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ (TGTWREIS), తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ (TG EMRS)లకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. మొత్తం 462 మంది విద్యార్థులు జేఈఈ (అడ్వాన్స్డ్)-2025 అర్హత సాధించగా, పలువురు విద్యార్థులు అత్యధిక పర్సంటైల్‌లు సాధించి మెరుగైన ఫలితాలు నమోదు చేశారు. చౌహాన్ ప్రవీణ్ 93.45 పర్సంటైల్, అజ్మీరా మహేష్ 91.97 పర్సంటైల్, రామవత్ లక్ష్మణ్ నాయక్ 90.01 పర్సంటైల్, బానోతు కార్తిక్ 90.18 పర్సంటైల్ సాధించగా, పాథ్లావత్ స్వాతి 89 శాతం పర్సంటైల్ సాధించారు. మొత్తం ఫలితాల్లో 90 పైగా పర్సంటైల్ సాధించిన వారు 5 మంది, 80-90 మధ్య 27 మంది, 70-80 మధ్య 71 మంది, 60-70 మధ్య 83 మంది, 50-59 మధ్య 109 మంది ఉన్నారు. ఈ విజయానికి కారణంగా విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శనం, ప్రత్యేక కోచింగ్, వైద్య-వసతి సౌకర్యాలు, లక్ష్యసాధనకు అనుకూల వాతావరణం ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటుతూ ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు.

# డాటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయాలి – భూ పరిహారంలో ఉదారంగా ఉండాలి: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో డాటా సెంటర్ల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ఇతర రాష్ట్రాలు అందిస్తున్న రాయితీలపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డాటా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు అవసరమైన భూమి, మౌలిక వసతుల కల్పనపై సీఎం సమగ్రంగా చర్చించారు. భూ కేటాయింపులో హేతుబద్ధత పాటించడంతో పాటు వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూ పరిహారం నిర్ణయించే విషయంలో రైతులను పిలిచి చర్చించి వారు సంతృప్తి చెందేలా ఉదారంగా వ్యవహరించాలని సీఎం స్పష్టం చేశారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టే సంస్థలకు భూమి ఖర్చు స్వల్పమేనని, ప్రభుత్వము సకాలంలో భూమి మరియు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచితే పనులు వేగంగా పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# నగరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం – విధుల్లో నిర్లక్ష్యం సహించం: సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 18: హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడుతూ తాను ప్రత్యక్ష పరిశీలనకు వస్తానని, ఎక్కడైనా చెత్త కనిపిస్తే సహించబోమని హెచ్చరించారు. మూడు నగరాల కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్రస్థాయిలో పర్యటనలు చేపట్టాలని సూచించారు. ప్రకటనల ఆదాయం పెంపు విధానంపై సమీక్షిస్తూ నగర కూడళ్లలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేసి ఎలక్ట్రిక్ కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటన బోర్డులు సమగ్రంగా అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. నెక్లెస్ రోడ్ సహా పలు ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్లో మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటు అవకాశాలపై అధ్యయనం చేయాలని, స్కైవాక్ మార్కెట్లపై కూడా సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూరు నగరాల ప్రకటనల ఆదాయాన్ని పరిశీలించి హైదరాబాద్ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి నష్టం కలిగించే ప్రకటనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ, సంక్షేమ కార్యక్రమాల ప్రచారానికి 10 శాతం బోర్డులు కేటాయించాలని పేర్కొన్నారు. మూడు నగర పాలక సంస్థలతో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో వీధిదీపాల నిర్వహణలో యూనికోడ్ సిస్టమ్ అమలు చేయాలని, పార్కుల వివరాలు సేకరించి అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఛైర్మన్లు, డిప్యూటీ ఛైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం త్వరలో నిర్వహించి పట్టణాభివృద్ధి దిశగా మార్గదర్శనం చేస్తానని సీఎం తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సంబంధిత కమిషనర్లు పాల్గొన్నారు.

# జిల్లాలో మోడల్ అంగన్వాడి కేంద్రాలు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్






సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 18: జిల్లాలో మోడల్ అంగన్వాడి కేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పిల్లల ఎత్తు, బరువు నిరంతరం పరిశీలించి పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో నూతన ప్రీ-స్కూల్ సిలబస్ ప్రకారం బోధన చేపట్టి పోషణ్ ట్రాకర్ ద్వారా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వయోవృద్ధుల మెయింటెనెన్స్ కేసులు, సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు మహిళలపై ఎలాంటి ఆకృత్యాలు జరగకుండా చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో టాయిలెట్లు, తాగునీటి సదుపాయం, మరమ్మత్తులు త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహరావు, సూపరింటెండెంట్ జి. హుస్సేన్, డిసిపివో రవి కుమార్, ఎఫ్.ఆర్.వో బి. వినోద్ కుమార్, సంకల్ప జిల్లా కోఆర్డినేటర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు



# తెలంగాణ బాపుకి జన్మదిన శుభాకాంక్షలు

Lసందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్): తెలంగాణ బాపుగా పేరొందిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) జన్మదినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. 1954 ఫిబ్రవరి 17న సిద్ధిపేట జిల్లా చింతమడక గ్రామంలో జన్మించిన ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు సాహిత్యంలో ఎం.ఏ పట్టా పొంది తన భాషా పటిమతో ప్రజలను ఆకట్టుకున్నారు. 1970లలో యువజన కాంగ్రెస్‌తో రాజకీయ ప్రయాణం ప్రారంభించి, 1983లో టీడీపీలో చేరి సిద్ధిపేట నుండి వరుసగా ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ 2001లో తన పదవులకు రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్)ను స్థాపించడం ద్వారా ఉద్యమానికి కొత్త ఊపు తీసుకొచ్చారు. "తెలంగాణ వస్తేనే మన బతుకులు మారుతాయి" అన్న నినాదంతో అచ్చమైన తెలంగాణ యాసలో చేసిన ప్రసంగాలు ప్రజల్లో ఉత్సాహం నింపాయి. 2009లో చేపట్టిన 11 రోజుల ఆమరణ నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు దారితీసింది. సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ వంటి కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాలను ఏకం చేసి ఉద్యమాన్ని విజయవంతం చేశారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి మిషన్ భగీరథ, రైతు బంధు, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి పథకాలతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారు. రాజకీయ జీవితంలో ఎదురుదెబ్బలు వచ్చినప్పుడల్లా మరింత బలంగా నిలబడటం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పటికీ, తెలంగాణ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# రాష్ట్రంలోని 116 మునిసిపాలిటీలకు కొత్త కమిషనర్ల నియామకం


తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం
మొదటి అంతస్తు, డిటిసిపి భవనము, ఏసి గార్డ్స్, హైదరాబాద్-500004

పత్రికా ప్రకటన

రాష్ట్రంలోని (116) మునిసిపాలిటీలు మరియు (7) మునిసిపల్ కార్పోరేషన్ లకు, రాష్ట్ర ఎన్నికల సంఘం తేది 27.01.2026 నాడు నోటిఫికేషన్ నెంబరు 150/TGSEC-ULBs/2026 & 209/TGSEC-ULBs/2026 ద్వారా ప్రకటించి, నిర్వహించిన రెండవ సాధారణ ఎన్నికల ప్రక్రియ నేటితో అనగా 17.02.2026 తో ముగిసినందున, పై నోటిఫికేషన్ లు జారీ చేసిన తేది నుండి సంబంధిత ప్రాంతాలలో అమలులో ఉన్న ఆదర్శ ప్రవర్తనా నియమావళి ముగిసినదని తెలియపరచడమైనది.

సం/-
కార్యదర్శి
తెలంగాణా రాష్ట్ర ఎన్నికల సంఘం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలోని 116 మునిసిపాలిటీలు మరియు 7 మునిసిపల్ కార్పొరేషన్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ప్రకటన జారీ చేసింది. ఈ మేరకు 27.01.2026 నాటి నోటిఫికేషన్ నంబర్లు 150/TGSEC-ULBs/2026 మరియు 209/TGSEC-ULBs/2026 ప్రకారం, నిర్దిష్ట రీత్యా స్థానిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా నియమితులైన కమిషనర్లు తమ బాధ్యతలు స్వీకరించారని పేర్కొన్నారు. 17.02.2026 న మునిసిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో సంబంధిత అధికారులను ఆయా స్థానాల్లో విధుల్లో చేరినట్లుగా రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ప్రకటనకు సంబంధించి పూర్తి వివరాలు అధికారికంగా విడుదలైన నోటిఫికేషన్‌లో పొందుపరచబడ్డాయి.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 18: ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలని, గ్రామ పాలన అధికారులు మరియు ఇతర సిబ్బందిని వారికి సహాయకులుగా నియమించి ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి వారి నుంచి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై అవగాహన కల్పించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలకు తెలియజేసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సీతారామారావు, సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ ఆర్డీవోలు వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసు, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వరాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ వీరుడు కేసీఆర్





సందేశం టైమ్స్..మెదక్ / అల్లాదుర్గం, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్): స్వరాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి నాయకత్వం వహించిన ఉద్యమ వీరుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) జన్మదినాన్ని అల్లాదుర్గం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అందోల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువకులు సమక్షంలో కేసీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ దళపతిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన కేసీఆర్ పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకమని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన నిరంతర ఉద్యమం, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఆయనను జన హృదయ నేతగా నిలబెట్టాయని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# ఘనంగా వాయిల సింగవరం గ్రామంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి జన్మదిన వేడుకలు



సందేశం టైమ్స్, అనంతగిరి మండలం, వాయిల సింగవరం, ఫిబ్రవరి 18: తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారి జన్మదినోత్సవాన్ని BRS మండల పార్టీ ఆధ్వర్యంలో వాయిల సింగవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్టింగ్ చేసి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లి దశాబ్దాల కలను సాకారం చేసిన చారిత్రాత్మక నాయకుడిగా కేసీఆర్ గారిని కొనియాడారు. రైతు సంక్షేమానికి "రైతు బంధు", "రైతు బీమా" వంటి వినూత్న పథకాలను అమలు చేసి రైతులకు భరోసా కల్పించారని, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారా గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించారని తెలిపారు. ఈ సందర్భంగా BRS గ్రామ శాఖ అధ్యక్షులు కంటూ శ్రీకాంత్ మాట్లాడుతూ కేసీఆర్ గారు దూరదృష్టి గల నేతగా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాతో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చారని, సంక్షేమం-అభివృద్ధి రెండింటినీ సమతూకంగా నడిపిన ప్రజానాయకుడని అన్నారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మార్గదర్శిగా ఆయన నిలిచారని పేర్కొన్నారు. కేసీఆర్ గారు ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందాలని, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో ముందుండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సడెన్ సర్ప్రైజ్ ఇన్స్పెక్షన్



జోగిపేట, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సాయంత్రం జోగిపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో విధుల్లో ఉండాల్సిన 23 మంది వైద్యుల్లో కేవలం ఒక్క డాక్టర్ మాత్రమే అందుబాటులో ఉండటంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ సౌకర్యం, ఖాళీ పోస్టుల భర్తీ, వైద్యుల గైర్హాజరు వంటి అంశాలపై పూర్తి తనిఖీ నిర్వహించి, డీసీహెచ్ఎస్ అధికారులు 24 గంటల్లో నివేదికలు కమిషనర్‌కు పంపాలని, షోకాజ్ నోటీసులు కాకుండా వెంటనే సస్పెండ్ చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ షరీఫ్ ఆసుపత్రి వార్డులను పరిశీలించి రోగులతో నేరుగా మాట్లాడారు; వీల్ బెడ్స్, వెస్ట్రన్ బాత్రూం, అంబులెన్స్ ఖర్చుల వంటి సమస్యలపై స్పందన ఇచ్చారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 31 డాక్టర్ పోస్టులలో 20 ఖాళీగా ఉన్నట్లు వెల్లడించబడింది. మంత్రి సూచించిన కఠిన చర్యలు అమలు అవుతాయా, లేక నివేదికలకే పరిమితం అవుతాయా అనేది ప్రతికూలంగా ఎదురుచూడబడుతోంది.

# వట్‌పల్లిలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు




వట్‌పల్లి, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్): అందోల్ నియోజకవర్గంలోని తెలంగాణ బాపు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) గారి పుట్టినరోజు సందర్భంగా వట్‌పల్లి మండల కేంద్రంలో ఘనంగా సంబరాలు నిర్వహించబడ్డాయి. కార్యక్రమాన్ని అందోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, కేసీఆర్ గారి దీర్ఘాయుష్షు కోసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో బిజిలిపూర్ గ్రామ సర్పంచ్ చక్రియాల నాగమణి, నర్సింలు, మాజీ ఎంపిటిసి నవీన సదానందం, ఉప సర్పంచ్ మచ్చేందర్, వట్‌పల్లి మండల మైనార్టీ అధ్యక్షుడు షాపొద్దీన్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కేసీఆర్ సేవలను స్మరించారు.

# పట్టు నిలుపుకున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్చెరు, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్: పటాన్చెరు మండల్ రిపోర్టర్ బి. డేవిడ్), సంగారెడ్డి జిల్లా: పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తన రాజకీయ పట్టు మరోసారి నిరూపించుకున్నారు. గుమ్మడిదల, జిన్నారం, గడ్డపోతారం, ఇంద్రేశం మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అయితే ఇస్నాపూర్ మున్సిపాలిటీని ఎంపీ రఘునందన్ రావు తన కో-ఆప్షన్ ఓటుతో దక్కించుకోవడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఫలితాలతో పటాన్చెరు నియోజకవర్గ రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# బిజిలిపూర్ ఉపసర్పంచ్ శోభ మచ్చేందర్‌కు పెళ్లిరోజు శుభాకాంక్షలు



వట్‌పల్లి, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ - సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల కేంద్ర పరిధిలోని బిజిలిపూర్ గ్రామ ఉపసర్పంచ్ శోభ మచ్చేందర్ పెళ్లిరోజు సందర్భంగా గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. గ్రామ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గ్రామ సర్పంచ్ చక్రియాల నాగమణి నర్సింహులు, మాజీ ఎంపిటిసి నవీన సదానందం, బిజిలిపూర్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మల్లేశం, వట్‌పల్లి మండల మైనార్టీ అధ్యక్షుడు షాపొద్దీన్ తదితరులు హాజరై శోభ మచ్చేందర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలూ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమం సాదాసీదాగా, ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

# ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ పీఠం బీఆర్ఎస్ కైవసం



పటాన్చెరు, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్: పటాన్చెరు మండల్ రిపోర్టర్ బి. డేవిడ్): కోరం లేక వాయిదా పడ్డ ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు పూర్తయింది. 10 మంది టీఆర్ఎస్, ఇద్దరు బిజెపి కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి 8వ వార్డు కౌన్సిలర్ కుశంగుల ప్రమీల, వైస్ చైర్మన్‌గా 12వ వార్డు కౌన్సిలర్ పట్లలో హరీష్ రెడ్డి ఎన్నికయ్యారు. నూతన పాలవర్గానికి స్థానిక నాయకులు, పార్టీ వర్గాలు శుభాకాంక్షలు తెలిపారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వేగవంతం చేయాలి — అదనపు కలెక్టర్ మాధురి



సంగారెడ్డి, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ మాధురి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో ప్రత్యేక సమగ్ర సవరణ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఎలాంటి తప్పిదాలు లేకుండా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఆర్ఓలు సవరణ ప్రక్రియను సమగ్రంగా పర్యవేక్షించి వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సంబంధిత అధికారులతో సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేస్తామని, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి సూపర్వైజర్లు, బీఎల్ఓలు అంకితభావంతో పనిచేసేలా మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, డీఎం సివిల్ సప్లై అంబాదాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్‌లో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు



నారాయణ ఖేడ్, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ నారాయణఖేడ్ నియోజకవర్గం ఇంచార్జి టి. చంద్రశేఖర్): సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కెసిఆర్) గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని జి.ఎం.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గృర్రపు మచ్చేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, క్షీరాభిషేకం నిర్వహించి, కెసిఆర్ దీర్ఘాయుష్షుతో ఉండాలని భగవంతుని ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఆయన చేసిన సేవలను స్మరిస్తూ పలువురు నాయకులు ప్రసంగించారు. వేడుకల్లో మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుముల మారుతి, మున్సిపల్, మండల మరియు గ్రామ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ సీనియర్ నేతలు, స్థానిక యువ నాయకులు మరియు అనేక కార్యకర్తలు హాజరై ఉత్సాహభరిత వాతావరణంలో కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించారు.

# ఘనంగా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు



పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ హందల్ నియోజకవర్గం ఇంచార్జ్ కే మల్లేశం గౌడ్, సంగారెడ్డి జిల్లా): పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.అందోల్ నియోజకవర్గ ఇంచార్జి కే. మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, కేక్ కట్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.వేడుకలో పుల్లయ్య గారి సుభాష్ చందర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు మూల మల్లేశం, హర్షద్, విష్ణు, నాదరి నర్సింలు, గంటి రవి, అంజయ్య, మహేష్ తదితరులు పాల్గొని గ్రామ ప్రజలతో కలిసి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు.

# పూజ్య శేఖర్ మహారాజు ఆశీస్సులు పొందిన జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుజ్జపు మచ్చేందర్



నాగల్గిద్ద మండలం, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ నారాయణఖేడ్ నియోజకవర్గ ఇంచార్జి టి చంద్రశేఖర్, సంగారెడ్డి జిల్లా): నాగల్గిద్ద మండలం కుభతండలోని శ్రీ సంత్ సేవలాల్ మరియు భవాని మాత ఆలయంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో పూజ్య శ్రీశ్రీశ్రీ శేఖర్ మహారాజు గారిని జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుజ్జపు మచ్చేందర్ భక్తిశ్రద్ధతో దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మహారాజు ఆశీస్సులు స్వీకరించిన మచ్చేందర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రాంత అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం మహారాజు దీవెనలు పొందడం విశేషంగా నిలిచింది. ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం కొనసాగింది.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విజయ్, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, గణపతి మహారాజ్, మారుతి మహారాజ్, మెగానాయక్ తండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పర్లాల్, యువకులు వాసు నాయక్, సుధాకర్, బాధ్య నాయక్, గాంధీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం ఆధ్యాత్మిక భావోద్వేగాల మధ్య విజయవంతంగా ముగిసింది.

# సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ పనులను మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షణ



సంగారెడ్డి, ఫిబ్రవరి 17 (సందేశం టైమ్స్ సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి కె. సంగమేశ్వర్): ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ ఎమర్జెన్సీ బ్లాక్‌లో మేడికల్, ఫైర్, పొల్యూషన్ కంట్రోల్, వాటర్, ఎలక్ట్రిసిటీ, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.మంత్రీ ఆదేశాల ప్రకారం, ఉగాది నాటికి హాస్పిటల్ అన్ని సౌకర్యాలతో సిద్ధంగా ఉండాలి. నీళ్లు, పవర్ సప్లై 24 గంటల పాటు కొనసాగాలి; ఫైర్ సేఫ్టీ అంశాలు పూర్తిగా పరిశీలించబడాలి. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, డయాగ్నస్టిక్స్, ఇన్‌పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు.సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ వంటి యంత్రాలు పూర్తిస్థాయిగా పేషెంట్లకు ఉపయోగపడేలా, అవసరమైన డాక్టర్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మరియు హాస్పిటల్ పనిచేయాల్సిన విధంగా అధికారులను కఠినంగా ఆదేశించారు.సమీక్షలో ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జేఎండీ మయాంక్ మిట్టల్, డీఎంఈ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు







సంగారెడ్డి / సదాశివపేట్, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారి జన్మదిన సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి ఆదేశాల మేరకు సదాశివపేట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.సదాశివపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శివరాజ్ పాటిల్, చింత సాయినాథ్, చింత గోపాల్ తదితర బీఆర్ఎస్ నేతలతో కలిసి కేక్ కట్ చేసి కేసీఆర్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో మరియు అభివృద్ధిలో కేసీఆర్ గారి నాయకత్వం చారిత్రాత్మకమని కొనియాడారు. రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని గుర్తు చేశారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా కేసీఆర్ గారి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న, కార్యదర్శి వీరేషం, కోడూరు అంజయ్య, చిక్కుల మల్లేశం, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# పటాన్‌చెరులో 3వ ధమ్మాయాత్రకు ఘన స్వాగతం.....





సంగారెడ్డి/ఫిబ్రవరి 18(సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి) కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా నుండి నాగార్జునసాగర్ బుద్ధవనం వరకు నిర్వహిస్తున్న 3వ ధమ్మాయాత్ర 2026 ఫిబ్రవరి 2న ప్రారంభమైంది. సుమారు 450 కిలోమీటర్ల మేర సాగనున్న ఈ పవిత్ర ధమ్మయాత్రలో థాయిలాండ్ దేశానికి చెందిన భిక్షువులు మరియు భారతీయ బౌద్ధ భిక్షువులు పాల్గొన్నారు. ఈ యాత్ర ఈ రోజు పటాన్‌చెరు చేరుకోగా, పటాన్‌చెరు అంబేద్కర్ యువజన సమితి ఆధ్వర్యంలో భిక్షువులకు, యాత్రికులకు స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా ఆహ్వానించి, "జైభీమ్" నినాదాలతో, బౌద్ధ మంగళగీతాల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాంతీయ ప్రజలు, యువజన సంఘాల ప్రతినిధులు, బౌద్ధ భక్తులు భారీ సంఖ్యలో హాజరై యాత్రకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, గౌతమ బుద్ధుని బోధనలు శాంతి, అహింస, సమానత్వం, సోదరభావానికి ప్రతీకలని పేర్కొన్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న అసహనం, వివక్ష, ద్వేష రాజకీయాలకు బౌద్ధ ధర్మం శాశ్వత పరిష్కార మార్గాన్ని చూపుతుందని తెలిపారు. యువత బుద్ధుని సూత్రాలను ఆచరణలో పెట్టి సమాజ నిర్మాణంలో సానుకూల పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. యాత్ర విజయవంతంగా నాగార్జున సాగర్ బుద్ధవనం చేరి దేశవ్యాప్తంగా శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వ సందేశాన్ని విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గగన్ మాలిక్ , ఫ్రా సొంగసాక్ కోవిడో , రుద్రారం శంకర్ , బల్వంత్ , ఆదిత్య రెడ్డి , కోమరగూడెం వెంకటేష్ , కృష్ణ , రాజు , విజయ్ , స్థానిక నాయకులు, బౌద్ధ భక్తులు, యువజన సంఘాల ప్రతినిధులు మరియు MPR యువసేన సభ్యులు పాల్గొన్నారు

# అందోల్-జోగిపేట్ 10వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ రేఖ ప్రవీణ్ ప్రమాణ స్వీకారం



అందోల్-జోగిపేట్, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): అందోల్ నూతన మున్సిపాలిటీ కౌన్సిలర్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ రేఖ ప్రవీణ్ తన అధికార బాధ్యతలను ప్రారంభించారు.ప్రమాణ స్వీకార సభలో రేఖ ప్రవీణ్ మాట్లాడుతూ, "తన వార్డును సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించడం నా ప్రథమ కర్తవ్యం. ప్రజల సమస్యల పరిష్కారం నా ప్రధాన లక్ష్యం. ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి సేవ చేస్తాను" అని హామీ ఇచ్చారు.తనపై విశ్వాసం ఉంచి ఓటు వేసిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తానని స్పష్టంగా ప్రకటించారు.

# హైదరాబాదులో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక క్యూర్ పరిధిలో మంత్రుల సమీక్ష



హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) పరిధిలో ఇండిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఈనెల చివరినాటికి లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని రాష్ట్ర హౌసింగ్, రెవెన్యూ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు. సమావేశంలో మంత్రులు సూచించిన విధంగా, మురికివాడల్లో అసంపూర్ణంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాల్సిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, మురికివాడలో నివసించని లబ్ధిదారులను గుర్తించి, స్థానిక పరిస్థితులను బట్టి 5-10 అంతస్తుల ఇండ్ల నిర్మాణం చేపట్టాలని, గతంలో శిధిలావస్థలో ఉన్న ఇండ్ల స్థలాల్లో కూడా కొత్త ఇండ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా క్యూర్ పరిధిలో 28,000 మంది లబ్ధిదారులకు ఈనెల చివరలో ఇండ్ల మంజూరు పత్రాలు అందజేయాలని, 2BHK కాలనీలలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాలు సమగ్రంగా అందించాలన్న ఆదేశాలు ఇవ్వబడినట్లు వెల్లడించారు. ఈ చర్యల ద్వారా నిజమైన లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించి, వాస్తవ అవసరాల పరంగా అభివృద్ధిని కొనసాగించడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# అందోల్- జోగిపేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిట్టి బాబుకు ఘన సన్మానం



అందోల్-జోగిపేట్, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): అందోల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ చిట్టీ బాబు గారికి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నేత మమ్మద్ ఆబిద్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సన్మానించి, గజమలతో ప్రత్యేక శుభాకాంక్షలు అందజేశారు.కార్యక్రమంలో కాజా ముత్తు, రసూల్, ఇమ్రాన్, సజ్జు, వీరేశం, అశోక్ రాజు, రమేష్, విజయ్, అడ్డు లడ్డు తదితరులు పాల్గొని చిట్టీ బాబు గారికి పూలమాలలతో ఘనంగా సన్మానం పలికారు

# జిల్లా స్థాయిలో PM విశ్వకర్మ పథకం అవగాహన కార్యక్రమం – MSME లబ్ధిదారులకు సమగ్ర గైడెన్స్






చివ్వెంల, సూర్యాపేట జిల్లా (సందేశం టైమ్స్: చివేంల ప్రతినిధి): Raising and Accelerating MSME Performance (RAMP) కార్యక్రమం ఆధ్వర్యంలో జిల్లాలో PM విశ్వకర్మ పథకం పై ఒక రోజు అవగాహన శిబిరం మంగళవారం MPDO కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సంప్రదాయ వృత్తిదారులు, శిల్పులు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా వ్యాపారవేత్తలకు పథకం ద్వారా లభించే రుణ సదుపాయాలు, శిక్షణ, టూల్ కిట్ సహాయం, వ్యాపార అభివృద్ధి అవకాశాలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగ ప్రసాద్ మాట్లాడుతూ, MSMEల పనితీరు, నైపుణ్య అభివృద్ధి, డిజిటల్ & మార్కెటింగ్ మద్దతు మరియు సామర్థ్య వృద్ధి కోసం ఈ అవగాహన శిబిరం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. మొత్తం 35 మంది లబ్ధిదారులు హాజరై, వీరిలో 20 మంది మహిళలు, 15 మంది పురుషులు ఉన్నారు. రిసోర్స్ పర్సన్ డీపీఎం అరుణ్ కుమార్ తెలిపారు, లబ్ధిదారుల సమస్యలను నమోదు చేసి సంబంధిత శాఖకు పంపి పరిష్కారం చూపించనున్నట్లు, ఇంకా రిజిస్టర్ కాని వారు పథకం తిరిగి ఓపెన్ అయ్యేవరకు వేచి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం నాగ ప్రసాద్, MPDO చ. సంతోష్, DRDO డీపీఎం అరుణ్ కుమార్, MPO దయాకర్, NIMSME EDC మేనేజర్ నరేష్, అసిస్టెంట్ మేనేజర్ రాజు, ప్రసాద్, SGH సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 16వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ పట్లూరి శ్రీనివాస్ అభివృద్ధి హామీ



అందోల్-జోగిపేట్, ఫిబ్రవరి 18 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): అందోల్ మున్సిపాలిటీలో నిర్వహించిన నూతన ప్రమాణ స్వీకార మహోత్సవంలో 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ పట్లూరి శ్రీనివాస్ ప్రసంగం చేశారు.తన వార్డును సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించడం తన ప్రథమ కర్తవ్యం అని, ప్రజల సమస్యల పరిష్కారం తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు. తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన వార్డు ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తానని ఆయన ప్రకటించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.